

రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎవివి.కుమార్ ఆధ్వర్యంలో కాశీపట్నం ఎస్‌బిఐ ఫీల్డ్ ఆఫీసర్ పి.చంద్రకిషోర్, అనంతగిరి యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ఆఫీసర్ దరఖాస్తుల పరిశీలన చేశారు. ఆన్‌లైన్‌లో 20మంది దరఖాస్తు చేసుకోగా ,ఇంటర్వ్యూలకు 17మంది హాజరయ్యారు. అర్హులైన అభ్యర్థుల జాబితాను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపిడిఒ కుమార్ వెల్లడించారు.

పర్యాటకాభివృద్ధి పేరిట

సహజ వనరుల దోపిడీకి కుట్ర

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: టూరిజం అభివృద్ధి పేరుతో గిరిజన ప్రాంతంలో ఉన్న సహజవనరులు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ చూస్తూ ఊరుకోబోమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర హెచ్చరించారు. అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం కేంద్రంలో ప్రభుత్వం ఐటిడిఎ ఆధ్వర్యంలో టూరిజం అభివద్ధి పేరుతో ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాలతో వర్క్‌షాప్ నిర్వహించారన్నారు ఏజెన్సీ ప్రాంతాల్లో గనులు, అటవీ భూములు, ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, వంటి సహజవనరులను టూరిజం పేరుతో ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులంతా టూరిజం అభివద్ధి పేరుతో 1/70 చట్టాన్ని ఉల్లంఘనపై తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. 1/70 చట్టాన్ని సవరించి ఏజెన్సీలోని అపారమైన సహజ వనరులు ప్రైవేట్ పెట్టుబాడిదారులకు, సంస్థలకు ఏట్ల కేటాయిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో 1/70 చట్టం సవరణపై రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు ఇంకా గుర్తున్నాయని, వాటిపై ఆదివాసి గిరిజనులు, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ప్రకటన చేసిందన్నారు. మరి ఇప్పుడు ప్రభుత్వం టూరిజం పేరుతో 1/70 చట్టాన్ని ఎలా తూట్లు పొడుస్తాయని మండి పడ్డారు అప్పట్లో .ఆదివాసీల ఆగ్రహాన్ని చల్లబరచాలనే ప్రభుత్వం ప్రకటన చేసిందే తప్ప, 1/70 చట్టం పరిరక్షణ ప్రకటనలో చిత్తశుద్ధిలేదని తాజా వర్క్‌షాపుతో తేలిపోయిందన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరులకు ఇల్లా స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర అసెంబ్లీలో ఆదివాసీ ప్రజాప్రతినిధుల ద్వారా ప్రకటన చేయిస్తున్నారంటే 1/70 చట్టాన్ని సవరించి, ఏజెన్సీలోని సహజ వనరులు ఇతరులకు కట్టబెట్టేందుకు టూరిజం అభివృద్ధి అంటూ ముసుగేసినట్లు స్పష్టమౌతోందని విమర్శించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అరకులోయ, డుంబ్రిగూడ పర్యటన గిరిజన అభివృద్ధి కోసం కాదని, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. .టూరిజం అభివద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరులు ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే కుట్రను ఆదివాసీ గిరిజన సంఘం తిప్పికొడుతుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 1/70 చట్టం పరిరక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూటమి ప్రభుత్వానికి గిరిజన ప్రధానిగా భవిష్యత్తులో తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం అరకులోయ మండల నాయకులు పి రామన్న, కె మగ్గన్న, కె రాము పాల్గొన్నారు.

దేవరపల్లిలో తాగునీటికి కటకట

- గ్రావిటీ పైపులైన్ లీకేజీతో అనునిత్యం పాట్లు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు
- కనీస సౌకర్యాలు లేవని గ్రామస్తుల ఆవేదన


పొలంలో పైపులైన్ లీకేజీ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని దేవరపల్లి గ్రామంలో ప్రజలు తాగునీటికి అల్లాడిపోతున్నారు. గ్రావిటీ పైపులైన్ ద్వారా గ్రామానికి తాగునీటి సరఫరా జరుగుతుండగా, నిత్యం ఏదో ఒక మస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేస్తున్నా, సమస్య మళ్లీ మొదటికే వస్తోందని వాపోతున్నారు.

మండలంలోని దేవరాపల్లి గ్రామంలో 15కుటుంబాలకు చెందిన 47మంది జీవనం సాగిస్తున్నారు. మూడున్నర దశాబ్దాల క్రితం గ్రామం ఏర్పాటైనా, నేటికీ తాగునీరు, రోడ్లు, ఇతర కనీస సదుపాయాలు లేవని దేవరపల్లి గ్రామ మహిళలు కిలో కమలమ్మ, పాంగి పూర్ణిమ, కొర్ర లలిత, పాతుని పూర్ణమ్మ, వంతల ధనలక్ష్మి ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటికి అల్లాడిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో ప్రజలకు నీటి అవసరాలకు బోరు లేని పరిస్థితుల్లో దూరాన ఉన్న కొండ నుంచి గ్రావిటీ పైపులైన్ ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టినా నిత్యం ఏదో ఒక సమస్యతో ఇబ్బందులు పడకతప్పడం లేదని వాపోతున్నారు పైపులైన్ లీకేజీతో గ్రామం వరకు మంచినీరు రావడం లేదని అంటున్నారు. లీకైన పైపులైన్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ఫలితం ఉండడం లేదని, దీంతో గ్రామానికి దూరంగా పైపులైన్ లీకేజీ వద్దకు వెళ్లి నీరు పట్టుకోక తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. సమస్యలపై పలుమార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించడం లేదని వాపోతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో మంచినీటి బోరు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే గ్రావిటీ పైపులైన్‌కు ఎటువంటి లీకేజీలు లేకుండా శాశ్వతప్రాతిపదికన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మఠం రామచంద్రావు, కొర్ర మంగ్లన్న, పేటియా అర్జున్ అన్నారు.

కనీస మౌలిక సౌకర్యాలు కరువు!

ఇవే కాకుండా తమ గ్రామానికి కనీసం మట్టిరోడ్డయినా లేదని, ఇతరత్రా కనీస మౌలిక సౌకర్యాలు లేక అల్లాడి పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. నిత్యవసరమైనా, అత్యవసరమైనా కాలినడకే తప్ప, మరో గత్యంతరం లేదని వాపోతున్నారు.గ్రామంలో ఐదుగురు బడిఈడు పిల్లలుండగా, వారు కిలోమీటరు దూరాన ఉన్న బౌడ పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని, బడికి వచ్చిపోయేందుకు వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేవరపల్లి గ్రామానికి ఎన్నికలప్పుడు తప్ప ఇతర సందర్భాల్లో నేతల సందర్శించిన దాఖలాలు లేవని, ముఖ్య అధికారులెవరూ ఇప్పటివరకు తమ గ్రామం ముఖం చూడలేదని అంటున్నారు. ఇప్పటికైనా దేవరపల్లి పై నేతలు, అధికారులు దృష్టిపెట్టి సమస్యలను పరిష్కరించి, సౌకర్యాలను కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గ్రావిటీ పైపులైన్ లీకేజీలను గుడ్డలతో అరికడుతున్న దేవరపల్లి మహిళలు



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా అధికారులు

బలిమెల జలాశయం నీటి నిల్వలపై సమీక్ష

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వలపై గురువారం ఇరు రాష్ట్రాల అధికారులు ఒరిస్సా మాలకనిగిరి జిల్లా బలిమెలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 -2025 నీటి సంవత్సరంలో ఇప్పటివరకు ఏయే రాష్ట్రాలు ఎన్నెన్ని టీఎంసీలు నీటిని వినియోగించుకున్నాయో లెక్కలు తేల్చారు. 2024 జులై నుంచి 2025 మార్చి నెలాఖర నాటికి ఆంధ్ర తన వాటా 69.8369 టీఎంసీలు నీటిని వినియోగించుకోగా ఒరిస్సా తనవాట 73.5147 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఇప్పటి వరకు ఆంధ్ర కంటే ఒరిస్సా 3.6778 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 44.7730 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఇందులో ఆంధ్ర వాటాగా 24.2254 టీఎంసీలు, ఒరిస్సా వాటా 20.7456 టీఎంసీలు గాను ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి ఇరిగేషన్ అవసరాల నిమిత్తం ఆంధ్రకి 3000, ఒరిస్సాకి 3000 క్యూసెక్కులు నీటిని ఏప్రిల్ చివరి వరకు వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్ర అధికారులు అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒరిస్సా తరుపున బీహెచ్ఈపి సీనియర్ జనరల్ మేనేజర్ దిలీప్ కుమార్ స్వైన్, బిహెచ్ఇపి టెక్నికల్ వింగ్ జనరల్ మేనేజర్ రాధా మాదాబ్, జనరల్ మేనేజర్ జ్యోతిర్మయ్య దాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు ఓం ప్రకాష్ నాయక్, ప్రశాంత్ కుమార్ పొట్టేరు, ఇరిగేషన్ చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ పితా బాస్ సేది, ఎస్ఈ రమాకాంత్ పాత్రో, ఏఇఇ తుఫార్ రంజన్ కుంటియ, ఈఈఈ గడాదర్ ప్రధాన్ పాల్గొనగా ఆంధ్ర తరపున సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ ఎం.శ్రీనివాసరెడ్డి, డిఈఈ కె.దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్దిగెడ్డ రిజర్వాయర్ పూడికతీతపై ఉన్నతాధికారులకు నివేదిక

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలంలోని మద్దిగెడ్డ రిజర్వాయర్‌లో పూడికతీత విషయమై ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించినట్లు జలవనరుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ తెలిపారు. 'చివరి పంటకు అందని నీరు' శీర్షికన ప్రజాశక్తి గురువారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. మద్దిగెడ్డ జలాశయం 1981లో ప్రారంభించగా, నాటి నుండి పూడిక తీయకపోవడం వాస్తవమేనని తెలిపారు. ఎడమ గట్టు డ్యామేజ్ విషయమై ఏమీ లేదని, అయితే మరోసారి రైతులందరూ కూడా పరిశీలించాలని కోరారు. ప్రస్తుతం రబీ పంటకు నీరు వెళుతుందని, దాన్ని ఎల్లవరం నీటి సంఘం ద్వారా తీయడం జరిగిందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెప్పారు.

సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని జి.తాడేపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శౌర్యమన్ పటేల్‌కు స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతితో స్థానిక టిడిపి నేతలు, ప్రజలు విన్నవించారు. గురవారం జాతీయ రహదారి పరిశీలనకు వచ్చిన సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌హెచ్ 516 జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని కోరారు. తాడిపుట్టు గ్రామపంచాయతీ గడుగుపల్లి గ్రామంలో హైవే రోడ్డు వల్ల వర్షం కురిస్తే ఎక్కడినీరు అక్కడే నిల్వ ఉండి, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రహదారికి ఇరువైపులా డ్రైనేజ్ మూతలతో నిర్మాణం చెయ్యాలన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. టిడిపియూనిట్ ఇంచార్జ్ సోమెలి లక్ష్మయ్య విఆర్ఒ లక్ష్మి సర్వేయర్ రవీంద్ర, పీసా కమిటీ ఉపాధ్యక్షులు నొగేలి సుబ్బారావు, సోమెలి వెంకన్న, పీసా కమిటీ సెక్రటరీ కిముడు ఆనంద్, విజయభాస్కర్ నాయుడు, టీచర్ వెంకటరమణ నాయుడు పాల్గొన్నారు

హోంస్టేలతో గిరిజనుల అభివృద్ధి

- జిల్లాలో శిల్పారామం ఏర్పాటుకు భూపరిశీలన
- ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తే దుకాణం సీజ్
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్ కుమార్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : గిరిజన గ్రామాల్లో పర్యాటకులకు హోంస్టేలు ఏర్పాటు చేస్తే గిరిజనుల అభివృద్ధికి దోహద పడతాయని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ అన్నారు. హోంస్టేలతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. లబ్ధిదారులు పాత గృహాలను తొలగించకుండా కొత్తగా ఇళు నిర్మించుకోవాలన్నారు. పాత ఇళ్లను హోం స్టేలకు అనుకూలంగా అభివద్ధి చేయాలన్నారు. హోం స్టేలలో పర్యాటకులకు గిరిజన వంటల రుచులను చూపించాలన్నారు.

గురువారం తాహశీల్దారులు, ఎంపిడిఒలు, పర్యాటక శాఖ, అటవీ శాఖ అధికారులతో పర్యాటక అభివృద్ధిలో భాగంగా గిరిజన ప్రాంతాలలో పర్యాటకుల హోంస్టేల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలో 15 హోమ్ స్టేలు ఏర్పాటుకు అవసరమైన గిరిజన గహాలను గుర్తించాలన్నారు. హోంస్టేల ఏర్పాటుకు ఆర్థికసాయం సెర్ప్ ద్వారా ఆర్థికసాయం అందిస్తామన్నారు. హోంస్టేలతో సామాజిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయాన్నారు. చింతపల్లి మండలంలో తాజంగి, లంబసింగి గ్రామాలలో ఎన్ని గృహాలను గుర్తించారని ఎంపిడిఒను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో శిల్పారామం ఏర్పాటు చేయడానికి పాడేరు, హుకుంపేట మండలాల్లో 25 ఎకరాల భూమిని గుర్తించాలని సూచించారు.

ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే దుకాణం సీజ్

ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలు కాలుష్యకారకం కాకుండా ఉండేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించే, విక్రయించే షాపులను తనిఖీ చేసి సీజ్ చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి చెక్ పోస్టులు ఏర్పాటుపై ఆరా తీసారు. సచివాలయం సిబ్బంది, ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించాలన్నారు. అరకువ్యాలీ, రంపచోడవరం, పాడేరు, అడ్డతీగల, రాజవొమ్మంగి మండల కేంద్రాలలో ప్రధాన రహదారులను ఆక్రమించి రవాణాకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అటువంటి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ చట్టాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. దురాక్రమణలపై పోలీసులు, రెవెన్యూ, పంచాయితీ అధికారులు తనిఖీలు చేసి నోటీసులు జారీ చేయాలన్నారు. పర్యాటకు ప్రాంతాలను గుర్తించి పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన ప్రక్రియపై ఆరా తీసారు

సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం పిఒ కె. సింహచలం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డిఎఫ్ఒ పివి. సందీప్‌రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, సిపిఒ ఎస్-ఎస్ఆర్‌కె. పట్నాయక్, డిటి ఒ.దాసు, అరకు వ్యాలీ మ్యూజియం క్యూరేటర్ మురళి, 22 మండలాల ఎంపిడిఒలు, తాహశీల్దారులు, ఇఒపిఆర్‌డిలు, ఎపిఎఫ్‌డిసి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చింతపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ విజయభారతి

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ది యూనిటీ కప్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయ భారతి ముత్యాలమ్మఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియ హేమంత్ కుమార్‌తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. టోర్నీ నిర్వాహకులు దొండ చిన బాబు మాట్లాడుతూ 56 జట్లు పాల్గొంటున్న టోర్నీలో విజేతలకు రూ.75 వేలు, రన్నరప్‌కు రూ.35 వేలు, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్, బెస్ట్ బ్యాట్ మాన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అధ్యాపకులు టి జగత్ రాయ్, ఆర్గనైజషన్ కమిటీ సభ్యులు మండి భూషణం, ఎ.గోవింద్, వి.లోకేష్ పాల్గొన్నారు.

క్వారీ నిర్వాహకులు నిబంధనలు అమలు చేయాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం


మైనింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోను వివిధ మండలాలలో వివిధ రకాలైన క్వారీలు లీజుకు తీసుకున్న నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో క్వారీలు నిర్వాహకుల ప్రతినిధులు, మైనింగ్ అధికారులతో గురువారం ఐటిడిఎ పిఒ కట్ట సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచల మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని 11 మండలాలలో మొత్తం 33 క్వారీలు ఉన్నాయని, ఇందులో 14 క్వారీలు పని చేస్తుండగా, మిగతా 19 క్వారీలు ప్రభుత్వం నుండి అనుమతులు లేని కారణంగా ఆపివేయడం జరిగిందని చెప్పారు. వై.రామవరం, రాజవొమ్మంగి, ఎటపాక, వీఆర్.పురం, కూనవరం మండలాల్లో ఏవిధమైన క్వారీలు లేవని పేర్కొన్నారు. క్వారీ నిర్వాహకులు క్వారీల సమీపంలోని గ్రామాల అభివృద్ధి, రోడ్లు, సేఫ్టీ, ప్రభుత్వా నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న క్వారీలలో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ ప్రతి క్వారీకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొసైటీ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం నుండి అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ప్రతి ఏటా రెన్యువల్ చేయించుకోవాలన్నారు. క్వారీల నుండి వచ్చిన ఆదాయంలో స్కూల్స్ అభివృద్ధి, రోడ్లు ఏర్పాటు, ఆయా గ్రామ ప్రజలకు ఆరోగ్యంపై నిధులు ఉపయోగించాలని కోరారు. పీసా గ్రామసభల ద్వారా తీర్మానాలు చేసి అనుమతులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి యం.ఆనంద్, సర్వేయర్ కాళిదాసు, క్వారీ నిర్వహణ యాజమాన్యం కోసూరి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

బండారు సూర్యనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఎటపాక

సిపిఎం నాయకులు అమరజీవి కామ్రేడ్ బండారు సూర్యనారాయణ 33వ వర్ధంతి సభ గోళ్ళగట్ట గ్రామంలో జరిగింది. స్థానిక పార్టీ శాఖ కార్యదర్శి బండారు స్టాలిన్ జెండా ఆవిష్కరణ చేసి, సూర్యనారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి కాకా అర్జున్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ సీనియర్ నాయకులు బిబిజి.తిలక్, జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి., ఎటపాక మండల నాయకులు జి.హరి మాట్లాడారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ నాయకులు యంబి నర్సారెడ్డి, బండారు శరత్‌బాబు, భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, స్థానిక నాయకులు బండారు భరణి కుమారి, పెనుబల్లి భీష్మారావు, బుద్దుల కొండయ్య, జోగయ్య, కల్లూరి వెంకటరావు, నరేష్ పాల్గొన్నారు.

శబరి పరివాహక గ్రామాలకు పరిహారమివ్వాలి

సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య


మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని శబరి పరివాహక ప్రాంత గ్రామాలన్నింటికీ పోలవరం పరిహారం ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య డిమాండ్ చేశారు. మండలంలోని రేపాక గ్రామంలో శాఖ సమావేశం మడకం సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా బొర్రయ్య మాట్లాడుతూ శబరి బెల్టులో 14 గ్రామాలుండగా, ఇప్పటిదాకా బొజ్జరాయిగూడెం, ముల్లూరు, పెద్దార్కూర్, కొండ్రాజుపేట తదితర నాలుగు గ్రామాలకే భూమి ప్యాకేజీ ఇచ్చారని, ఇంకా 10 గ్రామాల వారు భూమి ప్యాకేజీకి నోచుకోలేదని పేర్కొన్నారు. 2006, 2022 సంవత్సరాలలో వచ్చిన వరదలకు మొత్తం అన్ని గ్రామాలు ముంపునకు గురయ్యాయని, అయినా కూడా 41.5 కాంటురులో చేర్చలేదని తెలిపారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం కాపర్ డ్యాం దగ్గర 2022 సంవత్సరంలో 38 మీటర్ల వరదకు ఈ 10 గ్రామాలు మొత్తం ముంపునకు గురయ్యాయని, అయినా 41.5 కాంటూరులో చేర్చడానికి అర్హత లేదా అని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు తడక లెక్కలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. భూమి ప్యాకేజీ ఇచ్చిన ముల్లూరు గ్రామాన్ని ప్రాధాన్యత గ్రామాల జాబితాలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. ఏ సంవత్సరంలో నిర్వాసితులను తరలిస్తారో నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ కట్ అఫ్ డేట్‌గా ప్రకటించాలని కోరారు. నిర్వాసిత ప్రజలకు న్యాయం చేయకపోతే మరో ఉద్యమానికి పూనుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు తెల్లం తమ్మయ్య, మాజీ సర్పంచ్ మడకం బొజ్జి, జోగయ్య, సత్యనారాయణ, ధర్మల లక్ష్మణ్ నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి దుప్పి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని దూసరపాలం పంచాయతీ సూరంపాలెం సమీప రక్షిత అటవీ ప్రాంతం నుండి దుప్పి దారి తప్పి గురువారం జానావాసాల్లోకి వచ్చింది. నీటిని తాగేందుకు గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలోకి వచ్చిన దుప్పిని ఊర కుక్కల తరుముకొని రావడంతో వాటి నుండి తప్పించుకునేందుకు సూరంపాలెం గ్రామంలోని ఓ ఇంట్లోకి దూరిపోయింది. ఇది గమనించిన ఇంటి యజమాని గడియ వేసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు దుప్పిని స్వాధీనం చేసుకునేందుకు తలుపు తీయగానే దుప్పి ఒక్కసారిగా స్థానికులను కొమ్ములతో బెదిరించి కొద్దిగా సేపు హల్‌చల్ చేసింది. గ్రామస్తులు అటవీశాఖ అధికారులు దుప్పిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, అది సమీప అటవీ ప్రాంతంలోకి పారిపోయిందని అటవీ శాఖ అధికారి రాము తెలిపారు. దుప్పిని చూసేందుకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు గుమ్మిగూడారు.


ఇంట్లోకి వెళ్లిన దుప్పి



విద్యుత్ కార్మికులతో ఉమామహేశ్వరరావు

రేపు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర సదస్సు

-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈనెల 12వ తేదీన విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం అరకువ్యాలీ మండలంలో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. విద్యుత్ సంస్కరణ పేరుతో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటుకరించాలన్న కుట్రను కార్మికులందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తును అదానీ, అంబానీ, ు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని కుట్ర చేస్తోందన్నారు. .పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు పిఆర్‌సి ఇవ్వాలని,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకే రకం పనిచేసే కార్మికులకు నాలుగు రకాలు వేతనాలు తగ్గించి ఇస్తున్నారని ఆరోపించారు.. ఖాళీ పోస్టుల్లో ఐదేళ్ల సర్వీస్ ఉన్న కాంట్రాక్ట్ కార్మికులతో తక్షణమే భర్తీ చేసి రెగ్యులర్ చేయాలన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో వాచ్‌మ్యాన్ పోస్టు ఉండాలని అన్నారు .12న జరిగే రాష్ట్ర సదస్సులో విద్యుత్ ప్రైవేటీకరణ, కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామారావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యకర జీవనం

ప్రజాశక్తి-చింతపల్లి: గర్భధారణ నుండి పుట్టిన బిడ్డకు రెండేళ్ల వయసు వచ్చేవరకు ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించడమే ఐసీడీఎస్ ముఖ్య లక్ష్యమని సిడిపిఒ జి వెంకటరమణి అన్నారు. గురువారం భీమసింగి సెక్టార్ పరిధిలోని మామిడిపల్లి అంగన్వాడి కేంద్రంలో కొత్తపాలెం సర్పంచ్ వనగల సోమరత్నంతో కలిసి గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి శిశువుకు జన్మనిచ్చి రెండేళ్లు వయసు వచ్చేవరకు వెయ్యి రోజుల వారి వ్యక్తిగత జీవనంపై ప్రత్యేకదృష్టి సారించేలా ప్రభుత్వం కార్యాచరణ నిర్ధేశించిందన్నారు. వారికి పౌష్టిక ఆహారం అందించడం తోపాటు ఆరోగ్యవంతంగా ఉండే విధంగా ఆరోగ్యశాఖతో సమన్వయం చేసుకొని అవగాహన కల్పిస్తున్నామన్నారు.. రెండేళ్ల కాలంలో పోషక లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ పద్ధతులను చేపడతామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ఎం రామలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్లు ఎస్.కె గౌహారున్నీషా, కె.విజయకుమారి, అంగన్వాడి కార్యకర్తలు రమణమ్మ, భువనేశ్వరి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ వెంకటరమణి

భోజన కార్మికుల సమస్యలపై మహా పోరు

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి- చింతపల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై మే నెలలో జిల్లా కేంద్రంలో మహాపోరుకు సిద్ధం కావాలని. సిఐటియు జిల్లా అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. గురువారంచింతపల్లి మండలం చెరుకుం పాకలు గ్రామంలో మధ్యాహ్న భోజనం కార్మికులతో సమావేశంలో చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు కనీసం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇద్దరు పని చేసే చోట ఒకరిపేరుతోనే అకౌంటు ఉండడంతో మరొకరికి జీతాలు అందజేతలో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయన్నారు. భోజన కార్మికులకు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలో వారి జీతాలు వేయ్యాలని డిమాండ్ చేశారు. జీతాలు, పెట్టుబడి పెట్టిన బిల్లులు ఎప్పుడు వేస్తున్నారో తెలియడం లేదని వాపోయారు. అక్కడక్కడ ఉపాధ్యాయులు కూడా మధ్యాహ్నం భోజన కార్మికులచే వంట పెట్టించుకుని తింటున్నారని ఇదేం న్యాయమని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు, మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. అప్పులు చేసి మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డిస్తున్నపరిస్థితుల్లో వారికి సకాలంలో బిల్లులు రాకపోతే ఎలాగని మండిపడ్డారు.. జీతాలు రాకపోయినా ఇంట్లో డబ్బులే తీసుకొచ్చి ఖర్చు పెట్టి భోజనాన్ని వడ్డిస్తున్నా, అటు ప్రభుత్వం గానీ, ఇటు అధికారులుగానీ భోజన బిల్లులు, కార్మికు వేతనాల చెల్లింపులో తాత్సారం చేయడం సరికాదన్నారు. మే నెల రెండో వారంలో చలో కలెక్టరేట్, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, దాన్ని విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షులు. పసుపులేటి లక్ష్మి. మండల అధ్యక్షులు మినుముల జ్యోతి. శాంతి. చెల్లమ్మ. సత్యవతి. కుమారి. భద్రమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నయ్య పడాల్

సచివాలయాలను యథావిధిగా కొనసాగించాలి



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు : మండలంలో18 సచివాలయాలను యథావిధిగా కొనసాగించాలని త్రస్నీ సిపిఎం మండల కార్యదర్శి కొర్రా త్రినాధ్, ఎం.నర్సింగ్ పడాల్, పి.భీమరాజు కోరారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న సచివాలయ ఉద్యోగుల కుదింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, గిరిజన ప్రాంతంలో ప్రత్యేక భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఏదైనా నిర్ణయం తీసుకుంటే మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సూర్యనారాయణ మూర్తికి వినతి అందజేసారు.

ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి, లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా. త్రినాధ్ మాట్లాడుతూ మండలంలో 23 గ్రామ పంచాయతీ పరిధిలో 375 గ్రాములు, సుమారు 50 వేల జనాభా నివసిస్తున్నారన్నారు.,గత ప్రభుత్వం హయాంలో ప్రజలకు పరిపాలన అందుబాటులో తేవాలని 18 సచివాలయాలను ఏర్పాటు చేయగా, ఇపుడు కూటమి ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో వాటిని 9 సచివాలయాలుగా తగ్గించడానికి ప్రయత్నం చేస్తోందని, దీని వల్ల ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరమౌతాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు దూరం అవుతారన్నారు. మండల పరిదిలో చాలా గ్రామాల్లో రోడ్డు, రవాణా సౌకర్యం లేదని, శివారు గ్రామాల ప్రజలు ఇపుడు సచివాలయాలకు వెళ్లాలంటే సగటున 15 కిలో మీటర్లు పైగా వెళుతున్నారన్నారు. అలాంటిది ఇపుడు సచివాలయాలను సగానికి తగ్గిస్తే ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు సచివాలయ సేవలు మరింత దూరం, మృగ్యమౌతాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో సచివాలయం స్థాయిలో ఉద్యమం చేస్తామనిహెచ్చరించారు.

పాఠశాల భవనానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ పటకడవడ మారుమూల గ్రామంలోని ఎంపిపి పాఠశాలకు సొంత భవనానికి నిధులు మంజూరైన నేపథ్యంలో దానికి అవసరమైన స్థల సేకరణకు గురువారం ఎంఇఒ కూడా ఈశ్వరరావు పరిశీలన చేశారు. జనసేన ఉపాధ్యక్షులు మజ్జి కృష్ణంరాజు, రప బుద్ధులతో కలిసి గ్రామాన్ని పర్యటించారు. గ్రామంలోని పాఠశాలలో పదిమంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాల ఏర్పాటైన నాటి నుంచి పరాయిగడపల్లో, చర్చి, దేవాలయాల్లో రోజుకొక చోట పాఠశాలను నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తిస్తే, నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎవరైనా దాతలు పాఠశాల భవనానికి స్థలం ఇచ్చేందుకు ముందుకు రావాలని ఎంఇఒ ఈశ్వరరావు కోరారు. కార్యక్రమంలో పాంగి బొంజుబాబు, పటకడవడ పీసా కమిటీలు అధ్యకలు గెమ్మలి అప్పారావు, కార్యదర్శి బుజ్జి బాబు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పాఠశాల సందర్శనలో ఎంఇఒ, జనసేన నేతలు

నేరాలు ఘోరాలు

తల్లీ కుమార్తెపై దాడి

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీకూతురుపై కత్తితో దాడిచేసిన ఘటనపై కేసు నమోదైంది. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... గాజువాక ప్రాంతానికి చెందిన బాలుడు, అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన బాలిక ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ అక్కయ్యపాలెంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. బాలికకు వేరొకరితో వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బాలుడు బుధవారం అర్ధరాత్రి అక్కయ్యపాలెంలో ఉంటున్న బాలిక ఇంటికి వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలిక తల్లిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఆమె మెడ, చేతులపై తీవ్రంగా గాయాలయ్యాయి. అనంతరం బాలిక మెడపై చేతులతో గట్టిగా నొక్కేశాడు. తల్లీకూతురు అరుపులు విని స్థానికులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. కత్తిని స్వాధీనం చేసుకున్నారు. బాధితులను చికిత్సను నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : చోరీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు గాజువాక క్రైమ్ ఎస్ఐ మన్మధరావు తెలిపారు. అక్కయ్యపాలేనికి చెందిన ఏర్ల వినయ్‌కుమార్, కొబ్బరితోటకు చెందిన కిల్లి తరుణ్‌కుమార్, సీకు కిషోర్ కలిసి గత నెల 28వ తేదీన ఒక మహిళ మెడలో బంగారం పుస్తెలతాడును తస్కరించారు. నిందితులను గాజువాక క్రైమ్ పోలీసులు గురువారం ఆటోనగర్‌లో పట్టుకున్నారు. వారి నుంచి రూ.1500, పల్సర్ బైకును స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు గురై ఈ విధమైన చోరీలు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఫీజు చెల్లించలేదని పరీక్షలకు దూరం చేయడం తగదు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : ఫీజులు చెల్లించలేదని 40 మంది విద్యార్థులను వార్షిక పరీక్షల్లో హాజరుకానివ్వకుండాజర్రెల గ్రామపంచాయతీ దాసరిపుట్టు గ్రామంలోని నేతాజీ ఇంగ్లీష్ మీడియం ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్ నిరాకరించడం దుర్మార్గమని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను మండిపడ్డారు. గురవారం సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో మండల వైస్ ఎంపిపి1 బోయి సత్యానారాయణతో కలిసి శ్రీను మాట్లాడుతూ, నిబంధనకు ఉల్లంఘిస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడమే కాకుండా,ఫీజులు ఇవ్వలేదనే సాకుతో ఫైనల్ పరీక్షలకు దూరం చేయడం గర్హనీయమన్నారు. మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో ఉంటున్న సిఆర్‌పిలు పాఠశాల యాజమాన్యానికి కొమ్ముకాస్తూ ఆదివాసీ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసేలా ప్రవర్తించడం దుర్మార్గమని హెచ్చరించారు.విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం ఇచ్చి ఫీజులు సున్నితంగా వసూలు చేయవలసిన యాజమాన్యం ఫీజుల పీడింపు సరికాదన్నారు.

40 మంది విద్యార్థులకు తక్షణమే పరీక్షలకు అనుమతి ఇచ్చేలపాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై డిఇఒ, ఏజెన్సీ డిఇఒ తక్షణమే విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన సంఘం కార్యదర్శి నరసయ్య, సీనియర్ నాయకులు సోలగం గాసిరం దొర,మరి శ్రీను , కొర్ర శ్రీను , బాలన్న పాల్గొన్నారు.



జోరుగా సాగుతున్న పూడికతీత పనులు

ముమ్మరంగా జలాశయ కాలువ పూడికతీత

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : మండలంలోని అప్పలరాజుపేటలోని ఒట్టిగెడ్డ రిజర్వాయర్ పంటకాలువ పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ రిజర్వాయర్ ద్వారా రాజవొమ్మంగి, తంటికొండ, దూసరిపాము పంచాయతీలకు చెందిన సుమారు 2000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. పూడిక తీయాలని కొన్నేళ్లుగా రైతులు కోరుతున్నా ఎవరు పట్టించుకోలేదు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి చొరవతో ప్రభుత్వం రిజర్వాయర్ కాలువ పూడికతీత పనులకు రూ.10 లక్షలు మంజూరు చేయడంతో ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఆయా పంచాయతీల రైతులు గురువారం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ అధ్యాపకులు, మన్యం కవి నూనె రమేష్ చింతూరు ఐటిడిఎ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద పర్యావరణ పరిరక్షణకు తీసుకోవల్సిన చర్యలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఐటిడిఎకు విచ్చేసిన వివిధ మండలాల ప్రజలకు ఉపశమనం కోసం చల్లని మజ్జిగ నూనె రమేష్ పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితం కొరకు ప్లాస్టిక్ నిర్మూలన చేయాలన్నారు. ప్లాస్టిక్ పర్యావరణానికి సమాజానికి కలుగజేస్తున్న అనార్థాలను తెలియజేశారు. ప్లాస్టిక్ పర్యావరణ కాలుష్యం, సముద్ర జీవులకు హాని, పశువులకు ముప్పు, ఆరోగ్య సమస్యలు, వ్యర్థ నిర్వహణ సమస్య, భూమి ఉర్వరత తగ్గింపు వంటి ఇబ్బందులను కలగజేస్తుందని చెప్పారను. ప్లాస్టిక్‌కు బదులుగా జ్యూట్, కాగితం వంటివి వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు కట్టా శైలజ, గూడెం హారతి, విద్యార్థులు వేముల చిరంజీవి, గణేష్, మురళి దుర్గ పాల్గొన్నారు.

శ్రీసుందర సీతారామచంద్రస్వామి వసంతోత్సవం

ప్రజాశక్తి-విఆర్.పురం : రెండో భద్రాద్రిగా పేరుపొందిన మండలంలోని శ్రీరామగిరిలో శ్రీసుందర సీతారామచంద్రస్వామి వసంతోత్సవం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ఆలయం నుండి స్వామివారిని పల్లకీపై బాజాభజంత్రీలు, మేల తాళాల నడుమ కళ్యాణ మండపం వద్దకు తోడుకొని వచ్చారు. అనంతరం స్వామివారికి వసంతోత్సవ వేడుకను అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పెందుర్తి సుదర్శన్ దంపతులు, స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ కే.దుర్గారావు, గ్రామస్తులు, పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలంలో వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయం అమలుపై రైతు సాధికార సంస్థ ఆధ్వర్యాన వెలుగు కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినడం వలన ఆరోగ్యం, ఆదాయం, ఆనందం కలగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో సువర్ణకుమారి, ప్రకృతి వ్యవసాయ విభాగం నుండి జి.గంగరాజు, బిజెపి నాయకులు ఇ.స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు గ్రామపంచాయతీ పరిధి సీలేరు, లైకాన్ పూర్, చంద్రుపల్లి, చింతపల్లి క్యాంప్, జీడీసీ క్యాంప్, టిఆర్సీ తదితర ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్డులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాడేరు అసెంబ్లీ కోఆర్డినేటర్ చిటికెల రాము తదితరులు పాల్గొన్నారు

తాగునీరూ కరువే..!

రాంబిల్లి మండలంలో దాహం కేకలు
లోవపాలెంలో ఎక్కడ చూసినా సాల్ట్ వాటర్
ఇబ్బందుల్లో ప్రజలు
పట్టించుకోని ఎమ్మెల్యే, ఎంపీ, అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి విలేకరి

యలమంచిలి నియోజకవర్గం పరిధి రాంబిల్లి మండలంలో పలు గ్రామాల ప్రజలకు తాగునీరు కరువైంది. పట్టించుకోవాల్సిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ గ్రామాలవైపు కన్నెత్తి చూడటం లేదు. వెరసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మండలంలోని జెడ్ చింతువ పంచాయతీ లోవపాలెంలో ఉప్పునీటి సమస్య తీరని వేదనను మిగులుస్తోంది. ఈ గ్రామంలో 70 మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయి. ఎన్‌టిఆర్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటి నుంచీ అవి ఇక్కడే ఉంటున్నాయి. వీరికి తాగడానికి మంచినీరు లేదు. ఉన్న బోర్లలో ఉప్పునీరు వస్తోంది. తాగునీటికి ఇబ్బందులుపడుతున్న ఈ గ్రామానికి జలజీవన్ మిషన్ కింద మంచినీటి సౌకర్యం కల్పించలేదు. రోజువారీ ఆదాయమున్నా, లేకపోయినా ప్రజలు తాగునీటికి రోజుకు రూ.30 నుంచి రూ.40 ఖర్చు పెడుతున్నారు. మంచినీరులేక రోజువారీ అవసరాలకు ఉప్పునీరు వాడుతున్నారు. ప్రజల ప్రాథమిక అవసరమైన మంచినీటి సౌకర్యాన్ని కల్పించలేని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎంపీ సిఎం రమేష్‌లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సిపిఎం ప్రజా చైతన్యయాత్రతో సమస్యలు వెలుగులోకి..

గత నెలలో సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్యయాత్రలో పలు సమస్యలు వెలుగుచూశాయి. లోవపాలెం, యాత కొత్తపట్నం, నేవీ కాలనీ, అప్పారాయుడుపాలెం, లాలం కోడూరు, చిన్న కలవలపల్లి గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్న దృశ్యాలు ఎక్కడికక్కడ కానవచ్చాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు తమకు తాగునీటిని అందించాలని పలుమార్లు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కానరాలేదు. దీంతో గత నెల 25న మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో భారీ ఆందోళనకు దిగారు. వారినుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడారు. ఫార్మా, సెజ్ కంపెనీలు శుద్ధి చేయకుండా నేరుగా విడిచిపెడుతున్న రసాయన వ్యర్థ జలాలు వల్ల లాలం కోడూరు, కృష్ణంపాలెం, జెడ్.చింతువ ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. తోటపాలెం సమీప ప్రాంతంలోని పరిశ్రమలు శుద్ధి చేయకుండా వ్యర్థాలను కాలువల్లోకి విడిచిపెట్టడంతో నీరు ఎర్రగా మారుతోంది. రోడ్డు పక్కనుంచి వెళ్లినవారు, పరిసర గ్రామాల ప్రజలు వాసన భరించలేక బాధపడుతూ జీవితాలు గడుపుతున్నారు. కలుషితనీరు తాగిన పశువులు, మేకలు చనిపోతున్నాయని చెల్లూరు రాజబాబు చెప్పాడు. సీతపాలెం, లోవపాలెం, పెదిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం, పెద్ద ఈతపాలెం, రామచంద్రపురం, లాలంకోడూరు సహా పరిశ్రమల సమీప గ్రామాల ప్రజలు వాయు కాలుష్యంతో పడరానిపాట్లు పడుతున్నారు. ఈ బాధలన్నీ ఓర్చుకొని బతుకుతున్నా సిఎస్‌ఆర్ నిధులతో తాగునీటి సౌకర్యాన్ని పరిశ్రమలు కల్పించడంలేదని లోవపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవం ఈ నెల 30న జరగనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఉత్సవాన్ని సజావుగా, శోభాయమానంగా నిర్వహించేందుకు గురువారం సాయంత్రం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా అన్ని విభాగాలూ సమన్వయంతో పనిచేయాలని, టిక్కెట్ల విక్రయం నుంచి వాహనాల నిర్వహణ వరకూ ప్రతి అంశాన్నీ ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని అన్నారు. ఈ నెల 29 సాయంత్రం 6 గంటల నుంచి సాధారణ దర్శనాలు నిలిపివేయనున్నట్లు తెలిపారు. రూ.1000, రూ.300 ధరల టిక్కెట్ల విక్రయాన్ని అనుకూల ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు పాసులు జారీ చేయాలని, కొండపైకి, దిగువుకు భక్తుల రవాణా కోసం తగిన సంఖ్యలో ఆర్‌టిసి బస్సులను అందుబాటులో ఉంచాలని అన్నారు. తాగునీరు, మజ్జిగ కేంద్రాలు, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లను విస్తృతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్, సైన్ బోర్డులు, శాశ్వత పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ సమస్య నివారణకు అదనపు స్థలాలను అభివృద్ధి చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ మాట్లాడుతూ చందనోత్సవం జరిగే ప్రతిచోటా కొండపైన, దిగువునా సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ కోసం అదనపు స్థలాలు కేటాయించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ అధికారులు, సింహాచలం ఆలయ ఇఒ కె.సుబ్బారావు, రెవెన్యూ, వైద్య, రవాణా, ఆర్‌టిసి, జివిఎంసి, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



గర్భిణులకు ఆరోగ్య సలహాలు అందిస్తున్న డాక్టర్ వెంకట రమణారావు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అడ్డతీగల : ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌లో అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు డాక్టర్ యర్ర వెంకట రమణారావు గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. ప్రతి నెలా 9, 10 తేదీల్లో జరుగు వైద్య పరీక్షలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పండా సతీష్ కోరారు. 63 మంది గర్భిణులకు గర్భధారణ పరీక్షలు, ల్యాబ్ టెస్టులు చేశారు. హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు గర్భిణుల్లో వచ్చే సమస్యలు, పాటించవలసిన జాగ్రత్తలు గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ స్టాఫ్ వరలక్ష్మి, వేణు, జానకి, ఊహ, కళ్యాణ్ ల్యాబ్, నాగమణి, దేవుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గురువారం మలేరియా దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎంపీడీవో లోకుల యాదగిరేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఈ మందు పిచికారి చేయాలన్నారు. మలేరియా దోమలు నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 సూరారెడ్డి. వైద్య సిబ్బంది సిహెచ్ ప్రసాద్, పలు శాఖల అధికారులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టిడిఆర్‌లు ఇస్తామనడం చట్ట ఉల్లంఘన

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు గతంలో 11 గ్రామాల్లో జారీ చేసిన 2013 భూసేకరణ చట్టం నోటిఫికేషన్‌ను వెనక్కు తీసుకుని, భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి టిడిఆర్ సర్టిఫికెట్లు ఇస్తామనడం చట్టాన్ని ఉల్లంఘించినట్లవుతుందని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ అన్నారు. టిడిఆర్ బదులు 2013 చట్టం కింద బాధితులకు ఉదారంగా నష్ట పరిహారం ఇవ్వాలని గురువారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. 'ఏ కారణం వల్లనో 2013 భూ సేకరణ చట్టం నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు పోగొట్టుకుంటున్న బాధితులకు ఈ రోజు వరకు చట్ట ప్రకారం నష్టపరిహారం లభించలేదు. నష్టపరిహారానికి బదులు టిడిఆర్‌లు ఇస్తామని మీటింగ్‌లు పెట్టి ఒత్తిడి చేస్తున్నారు. రోడ్డు విస్తరణ ప్రభావంపై క్షుణ్ణంగా నిపుణులతో అధ్యయనం చేయించి, నివేదిక సమర్పించి బాధితుల సమ్మతి ముందుగా తీసుకోవాలి' అని ఆయన అన్నారు. నష్టపరిహారాన్ని ప్రత్యక్షంగా ఇవ్వకుండా భూములు, ఆస్తులను సేకరించకూడదన్నారు. చట్ట ప్రక్రియను పక్కనబెట్టి టిడిఆర్‌లు ఇస్తామనడం 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించినట్లవుతుందని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని భంగపరిచినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో 2013 చట్టం కింద బాధితుల సమ్మతి తీసుకొని, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కలెక్టర్ జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

కలుషిత నీటి సమస్యపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్ టౌన్ ఫిషింగ్ హార్బర్ సమీపంలోని 38వ వార్డు బుక్కా వీధిలో జివిఎంసి కుళాయిల్లో డ్రెయినేజీ నీరు కలుస్తోందని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం బుక్కా వీధిలో మహిళలు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు ఆ ప్రాంతంలోని కలుషిత నీటిని బాటిళ్లలో నింపి తీసుకొచ్చి ప్రదర్శించారు.